క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ



రఘుపతిని పరామర్శిస్తున్న చిగురింత నర్సింహారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఆవుల శివాజీ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో తీవ్రంగా నష్టపోయిన ఫంక్షన్ హాల్ యజమాని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల రఘుపతిని బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, నాయకులు కుమార్, శివ, సేవ్యానాయక్, ఆనంద్ నాయక్, దశరథ నాయక్, వత్తుల నారాయణ, రాజు, ప్రవీణ్, జంగయ్య, దేవా తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేట్ క్రీడా మైదానానికి యాదయ్య పేరు

ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ



అమరుడు సిరిపురం యాదయ్య

బడంగ్‌పేట్: మహేశ్వరం మండలం, నాగారం గ్రామానికి చెందిన సిరిపురం యాదయ్య తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాష్ట్రం కోసం ప్రాణాలు వదిలి అమరులైన విషయం తెలిసిందే. అమరుడు సిరిపురం యాదయ్యను గుర్తించుకునేలా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అతిపెద్ద క్రీడామైదానానికి సిరిపురం యాదయ్య ప్లే గ్రౌండ్‌గా నామకరణం చేస్తూ విద్యాశాఖమంత్రి సబితా రెడ్డి అభ్యర్థన మేరకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు, ఉద్యమకారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా అమావ్యాస పల్లకీ సేవ



పల్లకీసేవ సందర్భంగా స్వామివారు

తుక్కుగూడ : మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా అమావ్యాస పల్లకీ సేవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహ్మ స్వామి దంపతులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు నక్షత హారతి దర్శనంలో కనిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీ శర్మ, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గుప్త



బడంగ్‌పేట్: బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గుప్తను ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రవికుమార్ గుప్త, పర్యవేక్షకులుగా లక్ష్మయ్యగుప్త, కిరణ్‌కుమార్‌గుప్త వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం మీర్‌పేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, బడంగ్‌పేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, జల్‌పల్లి అధ్యక్షుడు చంద్రప్రకాష్ గుప్త, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మూర్తి, కోశాధికారి సురేష్ గుప్త, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, సుమారు 400 మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. రెండోసారి ఏకగ్రీవ నియామకానికి సహకరించిన ఆర్యవైశ్యులకు శ్రీనివాస్‌గుప్త కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలంటూ సీఎంకు వినతి

కందుకూరు: మండలాన్ని కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని కోరుతూ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సోమవారం సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయప మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ పరిధిలో కందుకూరు మండలాన్ని కన్జర్వేషన్ జోన్ కింద ఉంచడంతో కడ్తాల్, ఆమన్‌గల్లు కంటే పొలాల ధరలు తక్కువగా ఉన్నాయని, దీంతో ఇక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దయచేసి రెసిడెన్షియల్ జోన్‌గా ఈ ప్రాంతాన్ని మార్చాలని, అదేవిధంగా వంద పడకల ఆస్పత్రి నిర్మించి డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరామని తెలిపారు.

నిలిచిపోయిన బీటీ డబుల్ రోడ్డు పనులు

- అసంపూర్తి పనులతో ప్రజలకు అవస్థలు
- రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ నీటి పైపులు
- నాసిరకంగా కల్వర్టుల నిర్మాణ పనులు
- త్వరలో పనులు ప్రారంభిస్తామంటున్నా ఆర్అండ్‌బీ అధికారులు



నిలిచిపోయిన బీటీ డబుల్ రోడ్డు

మహేశ్వరం: ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తుమ్మలూరు గేటు–మహేశ్వరం వయా తుమ్మలూరు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మొదట్లో రోడ్డు నిర్మాణ పనులు చకచకా జరిగినా కొద్ది రోజులకే మళ్లీ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. రోడ్డును వెడల్పు చేపట్టి మట్టి, కంకర పరిచి చదును చేసి రోడ్డు మధ్యలో అవసరమైన చోట వర్షం వరదనీరు పోవడానికి 10 కల్వర్టులు నిర్మాణం చేయడానికి పైపులు వేసి వదిలేశారు. పనులు మధ్యలో వదిలివేయడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రోడ్డు మధ్యలో స్తంభాలు, భగీరథ పైపులు, వాల్వులు..

తుమ్మలూరు–మహేశ్వరం మండల కేంద్రం వరకు రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ నీటి పైపులు, వాటర్ వాల్వులు అడ్డంగా ఉండడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. తొలగించాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు కోరడంతో అదిగో, ఇదిగో తొలగిస్తామని నిర్లక్ష్యం చేస్తున్నారు.

నాసిరకంగా కల్వర్టుల నిర్మాణం

తుమ్మలూరు గేటు – మహేశ్వరం మండల కేంద్రం మధ్య 10 కల్వర్టులను నిర్మాణం చేస్తున్నారు. అవసరమైన చోట పైపులు వేసి, రోడ్డు నిర్మాణం చేస్తున్న చోట కల్వర్టులు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేస్తున్నారు. కల్వర్టులను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మాణం చేసిన శ్లాబుకు సమయానికి నీరు పోయకుండా వదిలేయడంతో కల్వర్టులకు పగుళ్లు, తెల్లగా ఎండిపోయినట్టు దర్శనమిస్తున్నాయి. ప్రారంభంలోనే దెబ్బతినడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారులకు ఇక్కట్లు

తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మహేశ్వరం, తుమ్మలూరు నుంచి వచ్చే వాహనాలు శ్రీశైలం జాతీయ రహదారి వైపు, కందుకూరు వైపు వెళ్లాలంటే ఈ రోడ్డుపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. వాహనాలు వెళ్తుంటే దుమ్ము విపరీతంగా వచ్చి వాహనాలు చెడిపోతున్నాయని వాహనదారులు అంటున్నారు. వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారుతుందని అధికారులు స్పందించి రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, మిషన్‌భగీరథ పైపులు, వాల్వులు తొలగించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

> **త్వరలో పనులు ప్రారంభిస్తాం**
>
> రోడ్డు నిర్మాణ పనులను రూ.14 కోట్ల 20 లక్షల నిధులతో నిర్మాణం చేస్తున్నాం. రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ పైపులు, వాల్వులను తొలగించేందుకు విద్యుత్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి అంచనా వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే వాటిని తొలగించి రోడ్డు నిర్మాణ పనులను వారం పది రోజుల్లో ప్రారంభిస్తాం.
>
> – వేణుగోపాల్ రెడ్డి , డీఈ, ఆర్అండ్‌బీ శాఖ, మహేశ్వరం

మొక్కలు నాటి సంరక్షించాలి



మీర్‌పేట: మొక్క నాటి నీరు పోస్తున్న మేయర్ దుర్గ తదితరులు

మీర్‌పేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిర్లాహిల్స్‌లో నిర్వహించిన హరితోత్సవంలో ఆమె పాల్గొని మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం మాట్లాడారు. చెట్లు పెంచడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, తద్వారా చెరువుల్లో జలకళతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, డీఈ గోపినాథ్, ఆర్ఓ అంజన్‌రెడ్డి, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ సుధీర్, కార్పొరేటర్లు రాంచందర్, ధనలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరితహారం



మొక్కలు నాటుతున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పట్టణ ప్రగతిలో భాగంగా హరితహారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని టెలిఫోన్ కాలనీలో ఏర్పాటు చేసిన హరితహార కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఆధికారులు పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, మేనేజర్ నాగేశ్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ

- మేయర్ పారిజాత
- ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, అల్మాస్‌గూడలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో వేడుకలు నిర్వహించి విద్యార్థులకు పండ్లు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత మాట్లాడుతూ.. దేశానికి కాబోయే భావిభారత ప్రధాని రాహుల్‌గాంధీ అని అన్నారు. ఇటీవల ఆయన చేపట్టిన భారత జోడో యాత్రకి యావత్ దేశం నీరాజనాలు పలికిందన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు..సంతోషి, ప్రభాకర్ రెడ్డి, బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, ఎర్ర జైహింద్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, జంగయ్య, బాలకృష్ణ, జగన్, గోవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు

జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది



రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని షాహీన్‌నగర్ నహదీ హోటల్ నుంచి వాదే ముస్తఫా బస్తీ వరకు నూతన బీటీ రహదారి నిర్మాణమవుతుండటంతో స్థానికులు చైర్మన్‌ను ఆహ్వానించి సోమవారం సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 21, 22, 23 వార్డుల పరిధిలోకి వచ్చే ఈ రూట్‌లో రహదారి గోతులమయంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతూ వచ్చారన్నారు. మంత్రి సబితారెడ్డి కృషితో ఈ రహదారితో పాటు వాదే హదీస్, జల్‌పల్లి కమాన్ నుంచి జల్లిపల్లి గ్రామానికి విశాలమైన రహదారులను నిర్మించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ఉస్మాన్ షరీఫ్, నాయకులు సయ్యద్ అలీ, అజీజ్, మహ్మద్ గౌస్, నవీద్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించండి



సీఎం వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

హుడాకాంప్లెక్స్: దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న మునుగనూరు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని పలువురు పాత్రికేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరులో జరిగిన హరితోత్సవంలో పాల్గొన్న సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన కేసీఆర్.. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారిని ఆదేశించారని, ప్రత్యేక దృష్టి సారించి పాత్రికేయుల సమస్య వెంటనే పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపాలని మంత్రి సబితారెడ్డికి సూచించినట్లు జర్నలిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కటకం సుభాష్, తగరం సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, చండీశ్వర్ తదితరులు ఉన్నారు.

గృహ నిర్బంధం సమంజసం కాదు

హుడాకాంప్లెక్స్: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే హౌస్ అరెస్ట్ చేస్తారా అని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పోలీసులను ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం మహేశ్వరం నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ వస్తున్నారని పోలీసులు ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. ఇలా నిర్బంధించినంత మాత్రాన ప్రశ్నించకుండా నన్ను ఆపలేరని ఆమె మండిపడ్డారు.

హరితోత్సవానికి తరలిన నాయకులు



హరితోత్సవానికి వెళ్తున్న జల్‌పల్లి నాయకులు

పహాడీషరీఫ్: మహేశ్వరం తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరైన హరితోత్సవం కార్యక్రమానికి జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, వాదే ముస్తఫా, షాహీన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట ప్రాంతాల నుంచి బస్సుల్లో పహాడీషరీఫ్‌కు చేరుకొని.. అక్కడి నుంచి కలిసి తుమ్మలూరు సభాస్థలికి బయల్దేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, జనార్దన్, సూరెడ్డి కృష్ణారెడ్డి, అర్జున్, కొండల్ యాదవ్, యూసుఫ్ పటేల్, రవూఫ్, నిరంజన్ పాల్గొన్నారు.

‘మాతృదేవోభవ’ సేవలు అభినందనీయం

హోప్ ఫర్ స్పందన ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ



సరుకులు వితరణ చేస్తున్న హోప్ ఫర్ స్పందన సభ్యులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి ‘హోప్ ఫర్ స్పందన’ ఆధ్వర్యంలో సోమవారం సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ.. రూ.లక్ష విలువచేసే నిత్యావసర సరుకులు అందజేశారు. దివంగత గడంశెట్టి రమ్య, దివంగత రావుల పాటి సరోజిని జ్ఞాపకార్థం.. పెన్సిల్ వీణ సంస్థ భాస్కర్, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా సరుకులు అందజేశారు. మతిస్థిమితం కోల్పోయిన దివ్యాంగులను చేరదీసి సేవలు అందిస్తున్న మాతృదేవోభవ సంస్థను గుర్తించి వితరణ చేస్తున్నామని తెలిపారు. హోప్ ఫర్ స్పందన ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, కోఆర్డినేటర్ రఘుకు ఆశ్రమ నిర్వాహకులు గట్టుగిరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, రోజ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్టు



పోలీసు స్టేషన్‌లో సీపీఎం నాయకులు

కందుకూరు: సీఎం కార్యక్రమం దృష్టిలో ఉంచుకుని సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. సోమవారం తెల్లవారు జామున సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్‌ను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించి సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....సీఎం వచ్చిన ప్రతి ప్రాంతంలో తమ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. నియంత పాలనకు నిదర్శనమన్నారు. పోలీసుల ముందస్తు అరెస్టులు కేసీఆర్ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందన్నారు. 16 ఏళ్లుగా ఇళ్ల స్థలాల పోరాటం కొనసాగుతుంటే దాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. రానున్నకాలంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం కాంగ్రెస్ జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, మండల యూత్ నాయకుడు ఎస్.వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే దేశంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు నాయక్, ఖాజామోహినుద్దీన్, జి.సుధాకర్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, బి.ప్రశాంత్, ఎ.జగదీష్, బి.రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్‌నాయక్, ఎ.ప్రభాకర్, మహమూద్, నవీన్, ఫయాజ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆట,పాటలతో కళాకారుల సందడి

మహేశ్వరం: మండలంలోని తుమ్మలూరులో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కళాకారులు హరితహారం, చెట్ల పెంపకం వల్ల లాభాలు, మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తూ ఆట, పాట, మాటలతో అలరించారు. మ్యాక్ ప్రాజెక్టు గ్రౌండ్‌లో సభ వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిరంతరాయంగా సాంస్కృతిక సారథి కళాకారులు ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. సభకు హాజరైన జనం, కార్యకర్తలు పాటలకు ఉత్సాహంతో కెరింతలు కొట్టి సందడి చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భాస్కర్‌రెడ్డి

పహాడీషరీఫ్: తెలంగాణలో కాంగ్రెస్ రోజు రోజుకూ బలోపేతమవుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంటకు చెందిన స్థానిక యువకులు, మహిళలు ఆదివారం రాత్రి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్నాటకలో మాదిరిగానే ఇక్కడ కూడా అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రతి పేదవాడి గుండెల్లో కాంగ్రెస్ పార్టీ గూడు కట్టుకొని ఉందన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మస్న రవికుమార్, బొక్క భూపాల్ రెడ్డి, యూసుఫ్ ఖాద్రీ, సుల్తానా, అబ్దుల్ బారీ, ఫజిల్ ఖాద్రీ, సాదిక్, ఉబేద్, రాఘవేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముస్తాబైన ‘మనబడి’

- రూ.1.30కోట్లతో జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి
- నేడు ప్రారంభించనున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- పదో తరగతిలో అత్యున్నత ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్న మంత్రి





జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఇన్‌సెట్లో) డిజిటల్ తరగతి గది

మీర్‌పేట: డిజిటల్ తరగతి గదులు, సీసీ కెమెరాలు, మోడ్రన్ టాయిలెట్స్, తరగతి గదుల్లో అధునాతన విద్యుత్ దీపాలు, ఫ్యాన్‌లు, సోలార్ సిస్టమ్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్.. పాత్‌వే.. ఆకట్టుకునే వాల్ పెయింటింగ్‌లు.. ఇవన్నీ నిన్నమొన్నటి వరకు కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనఊరు–మనబడి కార్యక్రమంతో నేడు సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. విద్యాభివృద్ధే లక్ష్యంగా.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు సకల వసతులు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసింది. రూ.1 కోటి 30 లక్షల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

ప్రారంభించనున్న మంత్రి..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించనున్న విద్యాదినోత్సవంలో మనఊరు–మనబడిలో తీర్చిదిద్దిన డిజిటల్ తరగతి గదులు, అదనపు గదులు, స్టెమ్ ప్రయోగశాల, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నారు. అదే విధంగా పదో తరగతిలో జిల్లాలో 10/10 జీపీఏ సాధించిన బాలికలకు రూ.10వేల నగదు పురస్కారాలు, ప్రసంసా పత్రాలను అందజేయనున్నారు. దీంతో పాటు సులభంగా, అర్థవంతంగా పాఠ్యాంశాలు బోధించేందుకు స్వీయ ఆలోచన, సృజనాత్మకతతో ఉపాధ్యాయులు రూపొందించిన బోధనాభ్యసన నమూనాల ప్రదర్శన, టీఎల్ఎం మేళాను కూడా మంత్రి ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ సంచాలకులు దేవసేన, కలెక్టర్ హరీశ్, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.